# శ్రీ చెంగాళమ్మకు సరస్వతి అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి శరన్నవ రాత్రుల్లో భాగంగా శ్రీసరస్వతి దేవి అలంకారంతో భక్తులకు బుధవారం దర్శనమిచ్చింది. ఆలయ ప్రాంగణంలోని యాగ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగానికి, సరస్వతి అలంకారానికి ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన దువ్వూరు హరిప్రసాద్‌రెడ్డి, జ్యోతి దంపతులు వ్యవహరించారు. అమ్మణ్ణికి సారెలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సాయినగర్, పరమేశ్వరినగర్, మహదేవయ్యనగర్, ఝాన్సీనగర్, సంజీవి నగర్, ఇందిరా నగర్ నుంచి మేళతాళాలు, బాణాసంచా వేడుకలతో సారె సమర్పించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సహిత గురు శ్రీమతి పిజి సరితా కల్యాణ్, విద్యార్థి బృందంచే నృత్య ప్రదర్శనలు, సూళ్లూరుపేటకు చెందిన అంతరిక్ష ఆర్ట్స్ వారిచే నృత్య ప్రదర్శనలు అలరించాయి.



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# గజరాజరక్షక గోవింద....!



తిరుమల, అక్టోబర్9ప్రభాతవార్తప్రతినిధి:
ద్వాపరయుగంలో మొసలిబారి నుండి గజేంద్రుడ్ని కాపాడిన శ్రీమహావిష్ణువు కలియుగంలో భక్తులు పాపాలను తొలగించే వరదహస్తుడిగా శ్రీవేంకటేశ్వరస్వామి గజవాహనంపై బుధవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాలలో గజవాహనం దర్శనంతో భక్తులు గజరాజరక్షకా...గోవిందా అంటూ పులకించారు. గజవాహనం అనాది నుండి ప్రసిద్ధమే. పూర్వం యుద్ధాలలో రథగజాశ్వాలనువాహనాలుగా ఉపయోగించేవారు. గజవాహనమెక్కి వచ్చిన మలయప్పస్వామిని దర్శించుకుని భక్తులు భక్తిపునీతులయ్యారు. గజ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సివిఎస్‌ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ,భక్తులు పాల్గొన్నారు.



# బంగారురథంపై 'తిరుమలదేవుడు'



తిరుమల, అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:
స్వయంగా బ్రహ్మదేవుడే దగ్గరుండి కలియుగవైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజులపాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆరవరోజు సాయంత్రం చల్లనివాతావరణంలో బంగారుదేవుడు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి మహోన్నత బంగారురథంపై భక్తులనుకటాక్షించాడు. ఆలయం నుండి ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామిని ఆలయం ముందుకు అర్చకులు వేంచేపుచేశారు. చల్లటిగాలులు వింజామరల్లా వీస్తుండగా ఇక్కడ బంగారుగొడుగు అమర్చిన బంగారురథంపై వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారిని అధిరోహింపజేశారు. అర్చకులు కర్పూరహారతులిచ్చి ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి స్వర్ణరథంముందు భక్తులు గోవిందా...వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో స్వయంగా ఈ రథాన్నిలాగి భక్తిపారవశ్యంతో పునీతులయ్యారు. గోవిందనామ సంకీర్తనలు మిన్నుముట్టాయి. స్వర్ణరథం సాఫీగా సాగేలా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు.

## 12న 'చక్రస్నానమహోత్సవం'



తిరుమల, అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండలస్వామికి జరుగుతున్న తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల వైభవం శనివారం ఉదయంతో ముగింపుక చేరుకోనుంది. బ్రహ్మోత్సవాల్లో చివరివాహనంగా శుక్రవారం రాత్రి అశ్వవాహనంకాగా ,చివరిఘట్టంగా చక్రస్నాన మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగుతుంది. చక్రత్తాళ్వార్‌కు జరిగే ఈ పవిత్ర కార్యక్రమం ఆలయానికి పక్కనేవున్న శ్రీవరాహస్వామి పుష్కరిణిలో జరుగుతుంది. శనివారం ఉదయం 6గంటలనుండి 9గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. యజ్ఞాంతంలో ఆచరింపబడే అవభృధస్నానమే చక్రస్నానమహోత్సవం. తొమ్మిదిరోజులు ఒక యజ్ఞంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం ముందు శ్రీమలయప్పస్వామివారికి ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె కొబ్బరిజలం ఇత్యాది పవిత్రసుగంధద్రవ్యాలతో ఈ అభిషేకం చేస్తారు. శనివారం ఎంతో విశేషమైన రోజు గోవిందునికికావడంతో ఆ రోజు మరింతగా భక్తులు పుణ్యాస్నానాలాచరించనున్నారు. ఇప్పటికే టిటిడి అధికారులు, పోలీసు యంత్రాంగం పుష్కరిణి వద్ద గట్టి ఏర్పాట్లుచేపట్టింది. భక్తులు రోజంతా పవిత్ర స్నానం ఆచరించేలా అన్ని చర్యలు, ఏర్పాట్లు చేపట్టారు.

## ప్రైవేటు మద్యం షాపుల కైవసంకు ముందుకు రాని వ్యాపారులు

- 11వ తేదీ వరకు దరఖాస్తుల దాఖలుకు గడువు పొడగింపు
- 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన - 14వ తేదీ లక్కీడ్రా
- అప్పటి వరకు ప్రభుత్వ మద్యం షాపులు కొనసాగింపు



చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:
ప్రస్తుతం వున్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు మద్యం షాపులు తీసుకురావడానికి ప్రభుత్వం చేసిన నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రైవేటు మద్యం షాపులు కైవసం చేసుకోవడానికి వ్యాపారుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుందని, ఈ మేరకు ప్రభుత్వానికి భారీ ఆదాయం లభిస్తుందని ఆశించిన ప్రభుత్వ పెద్దలకు మద్యం వ్యాపారులు షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల కోసం వ్యాపారుల నుండి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి గడువు మరో రెండు రోజులు పొడిగించింది. ఈ మేరకు 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం వ్యాపారులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చును. మద్యం షాపుల కోసం దాఖలైన దరఖాస్తులను అధికారులు ఈ నెల 12, 13వ తేదీ పరిశీలిస్తారు. ఆపై 14వ తేదీ లక్కీ డిప్‌ను నిర్వహించి మద్యం షాపులను ప్రైవేటు మద్యం షాపు వ్యాపారులకు కేటాయిస్తారు. వీరు 15వ తేదీ నుండి ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేపట్టవచ్చును. అప్పటి వరకు ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ మద్యం షాపులను మందుబాబులకు అందుబాటులో వుంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గత ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజ్ పాలసీని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో నూతన ఎక్సైజ్ పాలసీని రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండేళ్ళ పాటు అమలులో వుండనున్న ఈ నూతన ఎక్సైజ్ పాలసీ మేరకు ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేసి వాటి స్థానంలో ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటు అవుతాయి. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో 104 ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటు కోసం అక్టోబర్ 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఈ నెల 10వ తేదీ వరకు మద్యం షాపుల కోసం దుకాణ వ్యాపారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునని, అలాగే అదే రోజు సాయంత్రం 5 గంటల్లోపు మ్యానువల్ దరఖాస్తులను ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లలో అందజేయాలని, 11వ తేదీ ప్రైవేటు మద్యం షాపుల ఎంపికకు సంబంధించి లక్కీ డ్రా వుంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులోకి రానున్న నూతన ఎక్సైజ్ విధానంలో నాన్ రీఫండబుల్ మొత్తం కింద 2 లక్షల రూపాయలకు ఒక షాపు కోసం మద్యం దుకాణ వ్యాపారులు చెల్లించాల్సి వుండటం, ఒక వేళ లక్కీ డిప్‌లో దుకాణం ఖరారు అయితే 2 నెలలకు ఒకసారి 11 లక్షల నుండి 14 లక్షల వరకు చెల్లించాల్సి వుండటం, ఆపై మద్యం కొనుగోలు కోసం 5 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాల్సి వుండటం, దీనితో పాటు 1.10 కోట్ల రూపాయలకు బ్యాంకు ష్యూరిటీ ఇవ్వాల్సి వుండటంతో మద్యం దుకాణాల కోసం పోటీ తగ్గిందని భావిస్తున్నారు. నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం జిల్లాలో మొత్తం 104 మద్యం షాపులు ఏర్పాటు కానుండగా అందులో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 14, నాలుగు మున్సిపాల్టీల పరిధిలో 23, మిగిలిన మండలాల్లో 67 షాపులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో 34 మద్యం షాపులకు ఏడాది ఫీజు 55 లక్షల రూపాయలు వుండగా మిగిలిన 70 మద్యం షాపులకు ఏడాది ఫీజు 65 లక్షల రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించింది. నూతన మద్యం పాలసీ ప్రకారం జిల్లాలో ఒకొక్క మద్యం షాపుకు 25 నుండి 40 వరకు దరఖాస్తులు వస్తాయని ప్రభుత్వం భావించింది. అయితే జిల్లాలో కొన్ని మద్యం షాపులకు బుధవారం సాయంత్రం వరకు ఒక్క దరఖాస్తు మాత్రమే దాఖలు అయ్యాయి. చిత్తూరు జిల్లాలో మొత్తం 104 మద్యం షాపులు ఏర్పాటు చేయనుండగా బుధవారం నాటి వరకు ఒక్క షాపు నెం.49కు మాత్రం 56 దరఖాస్తులు అందాయి. అలాగే షాపు నెం.29కు ఇప్పటి వరకు 36 దరఖాస్తులు, షాపు నెం.37కు ఇప్పటి వరకు 35 దరఖాస్తులు, షాపు నెం.93కు ఇప్పటి వరకు 34 దరఖాస్తులు అందాయి.

## పల్లె పండుగ - పంచాయితీ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త
పల్లె పండుగ - పంచాయితీ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా పిడి, డిపిఓ, పంచాయితీ రాజ్, గ్రామీణ, నీటి సరఫరా, ఎంపిడిఓలు, పంచాయితీ సెక్రటరీలు, ఏపిఓలు, పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాలో ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు నిర్వహించే పల్లె పండుగ - పంచాయితీ వారోత్సవాలు నిర్వహణపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రతి పంచాయితీ పరిధిలో ఈ సంవత్సరంలో చేసే అభివృద్ధి పనులకు సంబంధించి ఆ గ్రామంలో బోర్డు ఏర్పాటు చేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ రాజ్ శాఖల ద్వారా గ్రామ స్థాయిలో వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పంచాయితీ సెక్రటరీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పూర్తి చేయాలని, పంచాయితీ సెక్రటరీలు రెండు రోజులు ముందుగానే గ్రామ స్థాయిలో నిర్వహించే పల్లె పండుగ - పంచాయితీ వారోత్సవాల నిర్వహణకు సంబంధించి టామ్ టామ్ వేయించాలన్నారు. భూమి పూజ చేసే వాటికి సంబంధించి పంచాయితీల్లో ప్రచారం చేయాలని, పంచాయితీ పరిధిలో చేసే అభివృద్ధి కార్యక్రమాలు, భూమిపూజ చేసే వాటికి సంబంధించి పంచాయితీల్లో ప్రచారం చేయాలని, పంచాయితీ పరిధిలో చేసే అభివృద్ధి కార్యక్రమాలు, భూ పూజ వంటి కార్యక్రమాల పూర్తి వివరాలను ప్రజా ప్రతినిధులకు ముందుగానే తెలియజేయాలని పంచాయితీ సెక్రెటరీలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలలో సిసి రోడ్లు, శ్మశాన వాటికల గుర్తించిన వాటికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేయడం జరుగతుందని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా పంచాయితీ అధికారిణి సుశీల దేవి, మండల స్థాయిలో ఎంపిడిఓలు, పంచాయితీ సెక్రటరీలు, ఏపిఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఈఈలు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## నడిగడ్డ గ్రామస్థులకు చిరుత భయం!



సదుం అక్టోబరు9ప్రభాతవార్త
మండల పరిదిలోని నడిగడ్డ గ్రామం వద్ద చిరుతపులి కనపడిందనే వార్త నడిగడ్డగ్రామస్థులు భయాందోళనలకు గురిచేసింది. చివరకు అటవీ అధికారులు పరిశీలించి అవి చిరుత పులి పాదముద్రలు కావని తేల్చడంతో ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం చెరకువారిపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు సదుం నుంచి చెరకువారిపల్లెకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఏదో అడవి జంతువు వారి ముందు వైపు నుంచి రొడ్డు దాటి వెళ్లింది. సాయంత్రం బాగా పొద్దు పోవడంతో చీకటల్లో దానిని వారు చిరుత పులిగా బావించి అందరికి చెప్పారు. దీనితో నడిగడ్డ, మతుకువారిపల్లె గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రాత్రి ఇళ్లను వీడి ఎవరు బయటకు రాలేదు. ఆవుల వద్ద కుక్కలను కాపాలాగా ఉంచుకున్నారు. బుదవారం ఉదయం ఈవిషయం తెలుసుకున్న అటవీఅధికారులు సంఘటనాస్థలానికి వచ్చి అడవి జంతువు నడచి వెళ్లిన ప్రాంతాలను తనిఖీ చేశారు. పాదముద్రలను గుర్తించి పరిశీలించారు. వాటి కొలతలను తీసారు. ఈసందర్భంగా పాదమద్రలు పరిశీలించిన అటవీశాఖ బీట్ అదికారి మహేష్, ట్రాకర్ రమణయ్యలు అది చిరుతపులి కాదని తేల్చి చెప్పారు. రేసుకుక్కకాని, అడవి పిల్లి కాని అయిఉండవచ్చునని ప్రజలకు తెలిపారు. చిరుత ఇటువంటి ప్రదేశాలలోకి రాదని, తిరగదని వారు చెప్పారు. ఎవరు భయపడాల్సినపని లేదని ఆందోళనచెందాల్సిన పనిలేదని తెల్చి చప్పారు. ఉదయం వరకు నడిగడ్డ, మతుకువారిపల్లె వాసులుఇళ్ల నుంచి బయటకురాక పోగా ఆవులకుపాలు కూడా పిండలేదంటే ఎంత భయపడ్డారో.

## సరస్వతి దేవి అలంకరణలో ఏకవీరదేవి



రామచంద్రాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:
సూరావారిపల్లి సమీపంలో వెలసియున్న సురభీ గోసంరక్షణశాలలో బుధవారం మూల నక్షత్ర ప్రయుక్త మహాపర్వదినాన సరస్వతి దేవి అలంకరణలో ఏకవీరదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ అమ్మవారికి వివిధ రకాల సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, పలురకాల పుష్పాలతో అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో తీర్చిదిద్దారు. అనంతరం పూజలోని ప్రతి ఉపచారము యొక్క విశిష్టతను పిల్లలకు వివరించారు. భక్తులచే దర్బారు సేవ, కుంకుమార్చనలు నిర్వహించారు.

## రోడ్ల నిర్మాణానికి మెగా మాయ: ప్రజల జీవితాలపై నీలి నీడ

### చెరువుల్లో మట్టి తొలగింపుతో భయాందోళనకు గురౌతున్న రైతులు

తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు చెరువుల్లోంచి మట్టితొలగింపు రైతులను భయాందోళనకు గురౌతున్నారు. ఇప్పటికీ కొన్ని చెరువుల నుంచి మట్టిని తొలగిస్తూనే ఉన్నారు. నాయుడుపేట రేణిగుంట ఆరులేన్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి పనులు సుమారు ఏడాదిన్నరగా సాగుతున్నాయి. దాంతో ఆ రోడ్డు నిర్మాణ సంస్థ స్థానిక నాయకులు సహాకారంతో ఛాటా నాయకులకు మట్టితరలింపు కాంట్రాక్టు అప్పగించారు. ఇది ఓ ఉపాధిగా మారింది. ఈ నేపధ్యంలో ఎక్కడ చెరువు ఖాళీ ఉంటే అక్కడ మట్టి సేకరణకు పూనుకుంటున్నారు. దాంతో చెరువుల్లో మట్టి తొలగింపుతో గుంతలు ఏర్పడతాయని వర్షానికి నీరు చెరువులోకి వస్తే పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుందని చెబుతున్నారు. నీళ్ళు తాగటానికి వెళ్ళిన పశువులు గుంతల్లో పడి ప్రాణాలు కొల్పోతాయని వివరిస్తున్నారు. అలాగే మట్టి తొలగింపుతో మనుషులు కూడా ప్రాణాలు కొల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

**లింగమనాయుడుపల్లి వాసుల వేదన:**

నాయుడుపేట రేణిగుంట జాతీయ రహదారి 6లేన్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి మెగా కంపెనీ పనులు చేపట్టింది. రోడ్డు వేయటం మంచిదే కానీ ఆ ముసుగులో అసలే అంతతమాత్రాన ఉండే ప్రజాసౌకర్యాలను కాలరాస్తున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. లింగమనాయుడుపల్లి సమీపంలో రోడ్డు నిర్మాణానికి పంట కాలువలు, పైప్‌లైన్లు తవ్వేసారు. పనులు జరుగుతున్నపుడు ప్రశ్నించిన ప్రజలను అప్పటి శాసనసభ్యుడు కంటిచూపుతో కంట్రోల్ చేసారు. మెగాకు వత్తాసుగా నిలిచారు. గతంలో కూడా ప్రభుత్వం ప్రజాసదుపాయాల్ని పట్టించుకోక పోగా లింగమనాయుడుపల్లి వాసులే రోడ్డు నిర్మించుకున్నారు. పంటకాలువలను ఏర్పాటు చేసారు. అవి కాస్త మెగా పుణ్యమా అని కనుమరుగు కాగా ప్రస్తుతం పంట కాలువల్లేక తిప్పలు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇప్పటికైనా మెగా నిర్వాహాకులు దయ దలచి పంట కాలువలను నిర్మిస్తారో లేక రైతులను మోసం చేస్తారో వేచి చూడాలని వాపోతున్నారు.



ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

**ఓటు చెరువుకు ఎసరు:**

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి చెందిన ఓటు చెరువుపై మట్టి కాసురుల కన్ను పడింది. ఇక ఆలస్యం ఎందుకు? వెంటనే జెసిబిలు ఏర్పాటు చేసి మట్టి తరలింపుకు పూనుకున్నారు. ఓటు చెరువులో మట్టి గ్రావెల్‌తో కూడుకొని ఉంది. దాంతో మట్టి తరలింపుకు పూనుకుంటున్న గతంలో పరిపాలించిన వైసిపి నాయకులు కొందరు ఓటు గుంట చెరువును తవ్వటం ప్రారంభించారు. అయితే చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నా ఎవర్ని ప్రశ్నిస్తే ఏమౌతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ కేసులు పెడతారో అని భయభ్రాంతులౌతున్నారు. అయితే కనీసం పంచాయతీకి నిధులు అయినా వస్తాయా?; అనుకుంటే అదీలేదు. రోడ్డు కాంట్రాక్టర్ ఏమో కోట్లకు కోట్లు సంపాదించుకుంటున్నారు. కానీ పంచాయతీల ప్రజల మాత్రం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని వాపోతున్నారు.

## వరదబాధితులకు రూ.65వేల సాయం

శాంతిపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



మండలంలోని 64 పెద్దూరు పంచాయతీ సోమా పురం గ్రామస్తు లు విజయవాడ వరద బాధితు లకో సం తమ వంతుగా రూ 65333 ల విరాళాన్ని అందిం చారు. ఈనగదును బుధ వారం మండల టిడిపి అధ్య క్షుడు విశ్వనాథనాయుడు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీ కాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో నేతలు జనార్ధ నరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వైస్‌చైర్మన్‌కు ఘన సన్మానం

శాంతిపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



ఏపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంను శాంతిపురం మండల తెదేపా నేతలు ఘనంగా సత్క రించారు. సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్ బాబు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనా యుడు, నేతలుజనార్ధనరెడ్డి, ఉదయ్, నాగరాజు పాల్గొన్నారు.

## 'దేశం' తీర్థం పుచ్చుకున్న వైకాపా నాయకులు

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఆరిమాకులపల్లి గ్రామంలోని ఆరిమాని గుంగమ్మ ఆలయం ఆవరణలో జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సమక్షంలో బుధవారం పిళ్ళారికుప్పం పంచాయతీ మాలూరు గ్రామంకు చెందిన వైకాపా సీనియర్ నాయకులు, పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుబ్రమణ్యంరెడ్డి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సుబ్రమణ్యంరెడ్డిని పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ మాలూరు ఎస్టీ కాలనీ అభివృద్ధికి తాను చర్యలు తీసుకుంటానన్నారు. పార్టీలో చేరిన నాయకులు స్థానిక పార్టీ నాయకులతో క్రమశిక్షణతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గంధమనేని రాజశేఖర్‌నాయుడు, ఆరిమాని గంగమ్మ గుడి కమిటీ సభ్యులు కరణం జయచంద్రనాయుడు, జలేంద్రనాయుడు, ఢిల్లీ, హరినాథ్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



నగరి ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నగరి మున్సిపాల్టీ, నగరి రూరల్ మండలం, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన మున్సిపాల్టీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంను ప్రజా సమస్యలను పరిష్కరించుకోవడానికి సంబంధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## జిల్లా అటవీశాఖ అధికారిగా భరణి

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

జిల్లా అటవీశాఖ అధికారిగా ఎస్.భరణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.భరణిని ప్రభుత్వం చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారిగా బదిలీ చేయడంతో ఈ మేరకు ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ జిల్లా అటవీశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చైతన్యకుమార్‌ను ప్రభుత్వం జీఎడికి బదిలీ చేసింది.

## సరస్వతిదేవి అలంకరణలో అమ్మవార్లు

సదుం, అక్టోబరు 9 ప్రభాతవార్త :



మండల పరిదిలో వివిధ అమ్మవారి ఆల యాలలో జరుగుతున్న దసరా ఉత్స వాలలో భాగంగా బుధ వారం అమ్మవార్లకు మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వ తీదేవి అలంకరణ చేశారు. జాండ్రపేటలోని శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి, రెడ్డివారి పల్లెలోని చామంతుల యల్లమ్మ తల్లి దేవికి,అదేవిధంగా పచ్చారుమాకులపల్లెలోని శ్రీశ్రీ గంగాపురమ్మకు, సదుంలోని గ్రామ దేవత శ్రీసదుమమ్మకు సరస్వతిదేవి అమ్మవారి అలంకరణ చేశారు. ఉదయం అభిషేకం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళల చేత కుంకుమాభిషేకాలు జరిపించారు. రాత్రి ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా తితిదే ఆధ్వర్యంలో బూరగమందలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సదుమమ్మ ఆలయంలో కల్లూరు మతుకువారిపల్లె, నడిగడ్డ మతుకువారిపల్లె,సదుం యగ్రాతివారిపల్లె గ్రామాలకు చెందిన సదుమమ్మ వంశస్తులు,రెడ్డిసంక్షేమసంఘ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. రమామహేశ్వరి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి,రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వైస్‌చైర్మన్‌కు ఘన సత్కారం

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



ఏపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిర త్నంను కుప్పం తెదేపా పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా ఘనంగా సత్కరించారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయ కుడు పిఎస్ మునిరత్నం అని ఆయన సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, రాష్ట్ర తెదేపా కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## విజయవాడ వరదబాధితులకు నిత్యావసరాలు తరలింపు

కుప్పం,అక్టోబర్ 9 ప్రభాతవార్త



కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో కుప్పం లో ప్రజలనుంచి సేకరించిన విరాళాలు, నిత్యావసర సరుకులు, దుస్తులను బుధవారం ఆర్టీసీ బస్సులో విజయవాడకు తరలించారు. ఈ కార్యక్రమాన్ని ఏపిఎస్‌ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మె ల్సీ డా॥ కంచర్ల శ్రీకా ంత్‌లు జెండా ఊపి ప్రారంభిం చారు. దాదాపు 250 కుటుంబాలకు సరిపడా బి య్యం, పప్పులు, దుస్తులు, దుప్పట్లు, ఇతర సామగ్రిని శుక్రవారం కిట్ల రూపంలో వరద బాధితులకు అందిస్తామని ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలుడా॥వెంకటేష్, సత్యేంద్రశేఖర్, డిఎం పెంచలయ్య, జయంతి, శివమణి, షహీన్ తాజ్ పాల్గొన్నారు

## తెదేపా మైనార్టీ నేతలచే ఘన సన్మానం

కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



కుప్పం గ్రామీణ మండలం తెలుగుదేశం పార్టీ మైనా ర్టీ నేతలు బుధవారం ఏపిఎస్ ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంను ఘనంగా సత్కరించారు. కుప్పం లోని పార్టీ కార్యాలయంలో పిఎస్ ముని రత్నంకు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమం లో రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి వృద్ధురాలికి ప్రతినెలా ఉచిత బియ్యం

కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలో ఉన్న ఓ మైనార్టీ వృద్ధురాలికి తెదేపా నియోజకవర్గ పార్టీ విస్తరణ కమిటీ సభ్యులు కె.కన్నన్ అండగా నిలిచారు. భర్తచనిపోయి అటు బిడ్డలు, కోడళ్ల నిర్లక్ష్యంకు గురై ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలిని తనవంతుగా ప్రతినెలా ఆమెకు అవసరమైన బియ్యంను ఉచితంగా అందిస్తానని పేర్కొన్నారు.బుధవారం వృద్ధురాలికి బియ్యం బస్తాను అందించగా ఆమె కన్నీటి పర్యంతమై కన్నన్‌ను ఆశీర్వదించింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అమ్మవార్లకు తాళిబొట్లు బహూకరణ

చౌడేపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దసరా మహోత్సవాలను పురష్కరించుకొని గ్రా మంలోగల అమ్మవార్లకు దాత తాళిబొట్లను బ హూకరించారు. మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ అగ్రహారంలోని శ్రీరుక్మిణీ, సత్య భామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఆనందాచార్యులు రూ. 22వేలు విలువ చేయు బంగారు తాళిబొట్లను బహూకరించి, అలంకరించారు.

## అరగొండ కార్యదర్శిగా మురుగేష్ బాధ్యతల స్వీకరణ

తవణంపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండ కార్యదర్శిగా మురుగేష్ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న చైతన్యకుమార్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్.ఆర్.పురం మండలంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదమరి మండలం మాదిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మురుగేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్వర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన నేడు పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీ సీజ్

కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుత్రమద్ది గ్రామ సమీపం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలి స్తున్న లారీని బుదవారం ఉదయం పట్టుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై ధరణీధర తెలిపారు. పుత్రమద్ది అటవీ ప్రాంతం నుండి ఎలాంటి అనుమతులు, రికార్డులు లేకుండా గ్రానైట్ లారీని సీజ్ చేసి భూగర్భ గనుల శాఖ వారికి అప్పగించినట్లు తెలిపారు.ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధరణీదర తెలిపారు.

## తెలంగాణ పిసిసి అధ్యక్షులును కలిసిన బుల్లెట్ రవి

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్వరగౌడ్‌ను బుధవారం తిరుపతిలో చిత్తూరు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుల్లెట్ రవి మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ప్రసాదం, ఫోటోను అందజేసారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు యస్.షర్మిలరెడ్డికి అన్ని విదాలుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్ని విదాలుగా సహాయసహకారాలు అందిస్తారని ఏపి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన భరోసా ఇచ్చారు. అధ్యక్షులను కలిసిన వారిలో తిరుపతి జిల్లా బిసి అధ్యక్షులు నాగరాజుగౌడ్, తిరుపతి మాజీ సిటి కాంగ్రెస్ అధ్యక్షులు యాలపల్లి గోపి, చిత్తూరు జిల్లా సీనియర్ నాయకుడు పరదేశి తదితరులు వున్నారు.

## సచివాలయాల్లో ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు

పెద్దపంజాణి, అక్టోబర్ 9 ప్రభాతవార్త :



మండలంలోని లింగాపురం, అమ్మరాజుపల్లి, శంకర్రాయలపేట గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపీడీఓ కె.ఎన్. బాలాజీ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సచివాలయలలో సిబ్బంది హాజరురికార్డుల నిర్వహణ,కార్యాలయ పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. హాజరుపట్టిక, మూమెంట్స్ రిజిస్టర్లు,ఇతర అన్నిరకాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా మూమెంట్‌రిజిస్టర్లోవివరాలునమోదుచేయాలనిఆదేవించారు.సచివాలయంలోప్రజలకు నిత్యంఅందుబాటులోఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## దొరికినంత దోచెయ్..!

– ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు

– బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 అధికం

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ప్రభుత్వం మద్యం షాపులకు మంగళంపాడే సమయం దగ్గరు పడుతుండటంతో మద్యం షాపుల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు దొరికినంత దోచెయ్ అన్న చందాన వ్యవహరిస్తున్నారు. సూళ్లూరు పేటలో 14 మద్యం షాపులు ఉన్నాయి. ఇందులో ఒక్కో మద్యం షాపునకు నలుగురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొన్నటి వరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో అమ్మకాలు జరుగుతూ వచ్చాయి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం.. నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో ఎస్ఈబి రద్దయి దాని స్థానంలో ఎక్సైజ్ శాఖను తిరిగి అమల్లోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి షాపుల్లో విక్రయాలపై నియంత్రణ కరవయింది. ఇదే అదనుగా భావించి షాపుల్లో ఉన్న వారు చేతివాటం చూపుతున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 పెచ్చుపెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. రూ.120కు క్వార్టర్ బాటిల్ విక్రయించాల్సి ఉండగా, 150 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఫుల్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.70 వేకు పెచ్చుపెట్టి వసూలు చేస్తున్నారు. దీనికితోడు వచ్చిన సరుకు మొత్తంలో కొంత భాగాన్ని దొడ్డిదారిన బెల్టుషాపులకు తరలించేస్తున్నారు. మందుబాబులు రేటు విషయమై ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం లేదు. వ్యసనానికి లోను కావడంతో విధి లేక అధిక ధరలకు మద్యం కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇదిలావుంటే ఎక్సైజ్ అధికారులు గత కొంతకాలంగా ప్రైవేటు మద్యం షాపుల టెండర్ల హడావిడిలో ఉండటంతో ఈ ప్రభుత్వ షాపులపై పర్యవేక్షణ లోపించింది. దీంతో యథేచ్ఛగా వీరి ఆటలు సాగుతున్నాయి. మొత్తంమీద దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందాన ప్రభుత్వ మద్యం షాపుల్లో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కొత్తగా ప్రైవేటు మద్యం షాపులు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందేమో వేచి చూడాల్సిందే. మందుబాబులు మాత్రం ప్రైవేటు మద్యం షాపులు వస్తే తమకు కొంత రేటు తగ్గుతుందన్న ఆశతో ప్రస్తుతానికి సర్దుకుని పోతున్నారు.

## అటవీ భూములు స్వాధీనం

దరకాస్తు (చిట్టమూరు), అక్టోబర్ 9 ప్రభాతవార్త



చిట్టమూరు మండలం యల్ల సిరి, మొలకలపూడి, చిల్లకూరు తదితర గ్రామాల్లో అన్యాక్రాంతమైన అట వీ భూముల పరిరక్షణకు ఆ శాఖ బీట్ అధికారిణి హర్షిత్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. గత నెలరోజుల క్రితం దరకాస్తు గ్రామానికి సమీపంలోని అటవీ భూములు అన్యాక్రాంతంపై స్పందిం చిన ఆమె.. భూములను పరిశీలించి సాగుదారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ అటవీ భూముల ఆక్రమణే ధ్యేయంగా పెట్టుకున్న కొంతమంది ఆ భూములను సాగు చేసేందుకు సమాయత్తం అవుతుండగా, మరోమారు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం అన్యాక్రాంతమైన అటవీ భూములు చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. అటవీ చట్టాలను అతిక్రమించి భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎఫ్‌బిఓ హర్షిత్ హెచ్చరించారు.

## సరస్వతిదేవి అలంకారంలో చాముండేశ్వరిదేవి

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కోట మండలం గూడలి గ్రామంలోని రామలింగ చాముండేశ్వరిదేవి ఆలయంలో 7వ రోజు సరస్వతిదేవి అలంకరణలో చాముండేశ్వరిదేవి భక్తులకు బుధవారం దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. మూలనక్షత్రం, అమ్మవారి జన్మనక్షత్రం, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, శక్తి స్వరూపాలతో దుష్టసంహారం చేసిన తర్వాత దుర్గాదేవిని దసరా ఉత్సవాల్లో మూలనక్షత్రం రోజున వాక్దేవమూర్తి అయిన సరస్వతి రూపంలో అలంకరించారు. సరస్వతిదేవిని అలంకరించుకోవడం ద్వారా విద్యార్థులు వాగ్దేవి అనుగ్రహం పొంది సర్వవిద్యల్లో విజయం సాధిస్తారన్న నమ్మకం. మూలనక్షత్రం నుంచి విజయ దశమి వరకు విశేష పుణ్య దినాలుగా భావించి అమ్మవారిని ఆరాధిస్తారు. భక్త జనుల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞానప్రదాయని సరస్వతిదేవి. భక్తులకు ఆలయ ధర్మకర్త ఆశిం శ్రీనివాసులు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా విద్యానగర్‌లోని గణపతి ఆలయంలో సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోటలోని కోటమ్మ గుడిలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి.

## జొలర్ల నేత సుందరయ్యకు నివాళి

తడ, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దివంగత జాలర్ల నేత, తడ మాజీ జడ్పిటిసి బొమ్మన్ సుందరయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం తడతో పాటు ఆయన స్వగ్రామం వాటంబేడుకుప్పంలో కార్యక్రమాలు నిర్వహించారు. సుందరయ్య కుమారుడు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు, కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

## పెట్లూరు నిమ్మచీనీ పరిశోధన కేంద్రం అధిపతిగా శ్యామ్‌సుందర్ రెడ్డి

వెంకటగిరిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా వెంకటగిరి రూరల్‌లోని పెట్లూరు నిమ్మ చీనీ పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్ శ్యామ్ సుందర్ బాధ్యతలు తీసుకోన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ అర్టికల్చర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన బదిలీల్లో బాగంగా అనంతరాజు పేట కళాశాలలో ప్రొపెసర్‌గా పనిచేస్తున్న ఆయనను పెట్లూరు నిమ్మ చీనీ పరిశోదన కేంద్రం అధిపతిగా బదిలిచే శారు. ఆక్కడ పని చేస్తున్న అధిపతి డాక్టర్ మధుమతిని తిరుపతి నిమ్మ పరిశోదన కేంద్రంకు బదిలి చేశారు. శ్యామ్‌సుందర్ మాట్లడుతూ రైతులకు మేలు రకం నిమ్మ చీనీ మొక్కలను అందించడమే లక్ష్యం గా పని చేస్తామని తెలియజేశారు.అనంతరం పెట్లూరు పరిశోదన కేంద్రంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు అయనను పుష్పగుచ్చలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కామ్‌ధార్ నాయక్,ప్రతాప్ తదితరులు ఉన్నారు.

## చెందోడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధనకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ స్పష్టం చేశారు. కోట మండలం చంద్రశేఖపురం,చెందోడు, గ్రామాల్లో బుదవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో మెళకువలు గురించి రైతులకు వివరించి అవగాహన కల్పించారు. పిఎం కిసాన్ పథకం గురించి రైతులకు వ్యవసాయ పరికరాలు, రాయితీలపై వివరించారు. రైతులు తప్పనిసరిగా పొలంలో భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. రబీ, సీజన్‌లో అసరమయ్యే వరి వంగడలు వంటి రకాలు గురించి వివరించారు. వరిలో విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని విఆర్‌ఓల నుంచి ధ్రువపత్రాలు తీసుకోవాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ సిబ్బంది మాట్లాడుతూ పాడి పశువులకు షెడ్లు, గడ్డి విత్తనాలను రాయితీపై ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోండి

దక్కిలి. అక్టోబరు 9 ప్రభాతవార్త





రానున్న వర్షాకాలంలో గ్రామాలలో సీజనల్ వ్యాధు లు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని దక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. మరుగు నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైతే పంచాయితీ నిధులు నుండి బ్లీచింగ్‌ను కొనుగోలు చేసి పల్లెల్లో చల్లాలని వివరించారు. వైద్యాధికారి శ్రీహరి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.వైద్యశాఖ సిబ్బంది పల్లెల్లో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో అల్లాభక్షు,ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు,పంచాయితీరాజ్ ఏఈ చంద్రశేఖర్,ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీనారాయణ,వెలుగు ఏపీఎం జమునారాణి,పలు శాఖలుకు సంబందించిన అధికారులు,ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## లింగసముద్రం ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరయ్య రాజీనామా

**దక్కిలి, అక్టోబరు9, ప్రభాతవార్త;** దక్కిలి మండలం లింగసముద్రం ఎంపీటీసీ సభ్యుడు నావూరు కోటేశ్వరయ్య బుధవారం ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. కోటేశ్వరయ్య ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లాభక్షుకు తన రాజీనామా పత్రంను అందజేశారు.ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగతకారణాలతో పాటు కుటుంబ పరిస్థితుల వల్ల తాను ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు.రాజీనామా చేసిన కోటేశ్వరయ్య ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

## కుప్పాయపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దక్కిలి,అక్టోబరు 9 ప్రభాతవార్త;



మండలంలోని కుప్పాయపాళెం గ్రామంలో బుధ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారిని విజయభారతి రైతులకు పంటలు సాగుపై అవగాహన కల్పించారు.వరిపంట సాగులో విత్తనాలు ఎంపిక నుంచి నారు మడులు సాగు చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అంతేగాక విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగించడం తగ్గించాలని తెలిపారు.పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా పంటలు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునని వివరించారు.ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## ఆరిమాని గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



ఆరిమానిపల్లి గ్రామంలోని ఆరిమాని గంగమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆరిమాను గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచలపతి, ఇఓ తిమ్మారెడ్డిలు శాస్త్రోక్తంగా ఆలయ సంప్రదాయ ప్రకారం పూర్ణకుంభం, మేళతాళాలు, గొడుగులతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను ఆహ్వానించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలకు అలంకరించి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంను విఆర్ఓ సుబ్రమణ్యం కుటుంబసభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, రాజశేఖర్ నాయుడు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచరపతిరెడ్డి, జలంధర్‌నాయుడు, వెంకట రమణ, సిద్ధయ్యశెట్టి, ము నిరెడ్డి, హేమాద్రియాదవ్, స్థానికులు జగన్నాధనాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, బాలసుబ్రమణ్యం, దేవాలయసిబ్బంది,తయ్యూరు పాయకట్టు 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## రూ.34లక్షలతో నిర్మాణాలు:రెండేళ్ళుగా తాళాలు

### వైకాపా అస్మదీయుల కోసం పనులు: శివయ్యకు శఠగోపం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదేళ్ళ పాటు సాగిన పరిపాలన అస్మదీయుల జేబులు నింపటానికే పరిమితం చేసారు. నాయకుడు చెప్పిన వారికే పనులు. కాంట్రాక్టర్ అర్హత లేదు. ఐదేళ్ళ పాటు నోటి మాటే శాసనంగా పరిపాలన సాగింది. ఈ నేపధ్యంలో తమ పార్టీ అస్మదీయులకు పనుల కోసం శివయ్యకు శఠగోపం పెట్టడానికి కూడా వెనుకాడలేదు. నాయకుల తీరు ముసుగులో కొందరు ఇంజనీరింగ్‌శాఖ అధికారులు తమ పబ్బం గడుపుకున్నారు.ఓ ఇఇ అయితే మొదట తన పర్సంటేజ్ పెట్టకుంటే సంతకం పెట్టేది లేదని వసూలు చేసుకున్నారు.

**భక్తుల విరాళాలు,దుర్వినియోగం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరునికి భక్తులు కోట్లకు కోట్లు విరాళాలు అందిస్తుంటే కొందరు అధికార పార్టీ నాయకులకు పనులు అప్పగించేందుకు ఇంజనీరింగ్ అదికారులు ప్రణాళికల్లేకుండా చేపట్టిన పనులు నేడు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ఈ నేపధ్యంలో సన్నిధివీధిలో భక్తుల సౌకర్యార్థం రూ.34లక్షలతో నిర్మించిన స్నానపు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి అయి 20 నెలలు దాటిని ప్రారంభించలేదు. 2023 మహాశివరాత్రి నాటికి వాటిని అందించుటకు భక్తులు సమర్పించిన కానుకలను ఓ అధికార పార్టీకి చెందిన నాయకునికి పనులు అప్పగించారు. అయితే పనుల అప్పగించటం పక్కన పెడితే మరుగుదొడ్ల అవుట్ లెట్‌ను స్వర్ణముఖిలో పెట్టారని నది కలుషితమౌతుందన్న విమర్శలతో ప్రారంభోత్సవం అటకెక్కింది.

**రూ.34లక్షల వెచ్చించింది ఎవరి కోసం?**

భక్తులు అభివృద్ధికి విరాళాలిస్తుంటే వాటిని సద్వినియోగం చేయాల్సిన అధికారులు నాయకులను మెప్పించటానికి దిశ దెశ లేని విధంగా కాంట్రాక్టర్‌కు పనుల కోసం వృధా చేస్తున్నారనేందుకు స్వర్ణముఖి ఒడ్డున నిర్మించిన రూ.34లక్షల మరుగుదొడ్లే నిదర్శనం.2023 మహాశివరాత్రికే అందుబాటులో తెస్తామని పలుమార్లు ప్రకటించినప్పటికి రెండవ శివరాత్రి వెళ్ళినా పట్టించుకోలేదు. లక్షలు కుమ్మరించి నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగించక తాళాలు తగిలించి పెట్టుకున్నారు.

**ఇఇ వివరణ:**ఈ నిర్మాణాలు,ప్రారంభోత్సవాలకు సంబంధించి ఇఇ మురళీధర్‌రెడ్డిను ప్రభాతవార్త వివరణ కోరగా గతంలో అవుట్‌లెట్ స్వర్ణముఖి నదిలోకి వదలి పెట్టలేదని మరుగుదొడ్లలోని అంతర్గతంగా సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించామన్నారు.శ్రీకాళహస్తికి సంబంధించిన మురుగునీరు స్వర్ణముఖిలో కలుస్తున్న వ్యర్థాలన్ని పరిశుభ్రం చేయటానికి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయని అది ప్రారంభమైతే ఈ పైపులైన్లు కూడా అందులో కలుపుతామని వివరించారు.

## చంద్రయ్యశ్రేష్ఠి కుటుంబసభ్యులకు పరామర్శ

తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు, ఆర్యవైద్య అన్నదాన సత్రం ఛైర్మన్ పిజె.చంద్రయ్యశ్రేష్ఠి ఇటీవల స్వర్గస్తులయిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ చంద్రయ్యశ్రేష్ఠి కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. కుటుంబానికి ఎన్నడూ తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందనితెలిపారు. బృందమ్మతోపాటుపట్టణఅధ్యక్షుడువిజయకుమార్‌పాల్గొన్నారు.

## దేశాన్ని అభివృద్ధి చేసేది బిజెపి ప్రభుత్వమే

–డాక్టర్ చంద్రప్ప

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దేశాన్ని అభివృద్ధి చేసేది ఒక్క బిజెపి ప్రభుత్వమే అని తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప తెలిపారు. బుధవారం బిజెపి పార్టీ హర్యానా, జమ్ముకాశ్మీర్ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశానికి వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఎస్ఆర్‌నాయుడు ఆధ్వర్యంలో హర్యానా, జమ్ము, కాశ్మీర్, ఎన్నికల ఫలితాపై ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప పాల్గొని మాట్లాడుతూ హర్యానా, జమ్ముకాశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. ప్రజలందరికీ చేదోడుగా ఉన్న దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనే దీనికి కారణమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సభ్యత్వనమోదు కార్యక్రమంలో కూడా భారతీయ జనతాపార్టీ సభ్యత్వం తీసుకుని సభ్యులుగా చేరి పార్టీని తద్వారా దేశాన్ని బలపరచాల్సిందిగా కోరారు. అనంతరం బాణాసంచాపేల్చి, స్వీట్లు పంపిణీచేసుకున్నారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గురుప్రసాద్, అభిమానులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంకమ్మతల్లి కుంభాభిషేకానికి విరాళం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని అముదూరు గ్రామంలో నిర్వహించనున్న అంకమ్మతల్లి పోతురాజుల మహాకుంభాభిషేక మహోత్సవానికి రూ.5వేలు ఆర్థికసాయంను జనసేన నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట రూ.5వేలను ఆర్థికసాయంగా ఆలయ కమిటీకి అందించారు. ఈసందర్భంగా వినుత కోట మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు ఆధ్యాత్మికతను పెంచుతాయని ప్రతి ఒక్కరు భక్తిభావంతో పూజలు నిర్వహించుకోవాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందరు కలసికట్టుగా ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం వినుత కోటను కుంభాభిషేకానికి ఆహ్వానించారు.

## విజయదశమి పర్వదినం సందర్భంగా ఓపి, ఓటిలకు సెలవు

తిరుపతి హెల్త్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

స్విమ్స్ విజయదశమి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేది శనివారం ఓపి, ఓటిలకు సెలవు అని స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డా. ఆర్‌వి కుమార్ తెలిపారు. స్విమ్స్ అత్యవసర విభాగపు సేవలు యదాతధంగా కొనసాగుతాయని తెలిపారు.

## విచ్చల విడిగా రోడ్డు పక్కన తవ్వకాలు

ధ్వంసమవుతున్న రోడ్లు, పైపులైన్లు

విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:



ప్రైవేటు టెలికాం పేరుతో రోడ్డు పక్కన కేబుల్ పూడ్చడానికి విచ్చల విడిగా తవ్వకాలు జరపడం వలన రోడ్లు, పైపులైన్లు ధ్వంసమైపోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని శ్రీహరిపురం, కోసల నగరం ప్రాంతాల్లో పరిసర గ్రామాలకు తాగునీరు చేసే రాజీవ్ టెక్నాలజీ పైపులైన్లను ఇష్టానుసారం ధ్వంసంచేయడం వలన తాగునీటి సిబ్బంది ఏర్పడుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. మహారాజపురం వద్ద వ్యవసాయ బోరు పైపులైన్లను రోడ్డు మధ్యలో వేసిన కల్వర్టుపైపు సైతం దెబ్బ తింటుందని ఆరోపిస్తున్నారు. మండలంలోని బుగ్గ ఆనకట్ట నుంచి మంగళం చెరువు వరకు కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన వరవ కాలువ కూడా ధ్వంసమైపోతున్నాయని, వీటిపై సరైన సమాధానం చెప్పేవారు కూడా కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన మట్టి పడి ఉండడంతో కురుస్తున్న వర్షాలకు ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ విషయమై అధికారులు స్పందించి తగు చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

## ద్విచక్రవాహన కొనుగోలుదారులకు

శ్రీరామ్‌ఫైనాన్స్ చేయూత

తిరుపతి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

ద్విచక్రవాహనకొనుగోలుదారులకు రాష్ట్రంలో రుణాల అర్హత వోచర్‌ను శ్రీరామ్‌ఫైనాన్స్ ప్రారంభించింది. ఈ సౌకర్యం వల్ల వినియోగదారులు కొన్ని నిమిషాల్లోనే తమ లోన్ అర్హతను ముందుగానే పరిశీలించుకునే సదుపాయం ఉందని సిఇఒ వైఎస్ మిష్టర్‌చక్రవర్తి తెలిపారు. పండుగసమయంలో తమ కలల ద్విచక్రవాహనాన్ని కొనుగోలుచేయాలనుకునే ఖాతాదారుల కోసం ఈ వినూత్నమైన లోన్ ఎలిజిబిలిటీ వోచర్ దోహదపడుతుందన్నారు.

## రుయాలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



తిరుపతి హెల్త్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో నెల్లూరు జిల్లాకు చెందిన రమణమ్మ (62) రోగి రెండు వారాల క్రితం తీవ్రమైన ఆయాసం, దగ్గులో రక్త పడడం సమస్యలతో వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఎడమ ఊపిరితిత్తిలో అరుదైన ఫంగల్ బంతి ఈ సమస్యలకు కారణమని వైద్యులు నిర్ధారించారు. అప్పటికే కొద్దిగా గుండెకు, బృహద్ధమనికి కూడా పాకిందని ఈ కేసు నిర్ధారణలో డా. ఎస్. సుబ్బారావు, ఛాతీ వైద్య విభాగాధిపతి చాలా కృషి చేసారు. దీనికి ఒక క్లిష్టమైన శస్త్ర చికిత్స అవసరవమతుందని వైద్యుల బృందం నిర్ణయించారు. గుండె, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ కె. కళ్యాణి రమ, మత్తు మందు విభాగాధిపతి డా. జె. రాధ, డా. ఎస్. శ్రీనివాసులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది ఎంతో శ్రమించి ఈ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఫంగల్ బందిని తొలగించారు. ఆపరేషన్ తర్వాత రోగికి ప్రాణాపాయం తొలగి ఆమె కోలుకొంటుందన్నారు. ప్రత్యేక శ్రద్ధ చూపిన డాక్టర్ల, పారామెడికల్, నర్సింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. పి. శ్రీనివాస్, ఇన్‌చార్జి సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డా. ఇ.ఆర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఆర్ఎంఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలి



అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 20 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నందు హాజరు పరచగా జడ్జి గ్రంథి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయిలు చొప్పున మొత్తం 20 మందికి 2 లక్ష జరిమానా తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విదులు నిర్వర్తించాలని సూచించారు.

## అర్హులైన వీధి విక్రయదారులకు పిఎం స్వనిధి రుణాలు మంజూరు

కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

అర్హులైన వీధి విక్రయదారులకు పిఎం స్వనిధి పథకంలో అందించే రుణాలను వారికి త్వరితగతిన అందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం నగర పాలక సంస్థ కార్యాలయంలో టౌన్ లెవల్ బ్యాంకర్లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఏ బ్యాంకుల నుండి ఎంత మందికి రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. అర్హులైన వారిని అందరినీ గుర్తించాలని మెప్మా అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఉన్న డాక్యుమెంట్స్ అన్ని వారంలోపు పూర్తి చేసి బ్యాంకర్లకు అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, ఎల్‌డిఎం విశ్వనాథ రెడ్డి, టిఈలు కృష్ణవేణి, ప్రమీల, సిఎంఎం శ్రీరాములు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

తిరుమల శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఉదయం తిరుపతికి చేరుకున్న తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బొమ్మన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరచిట్టిబాబు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం



తిరుపతి, ప్రభాతవార్త

## శ్రీతారానీల సరస్వతి అలంకరణలో దుర్గాదేవి

రామచంద్రాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో బుధవారం శ్రీతారానీల సరస్వతి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనంద మహా భారతి స్వామి పర్యవేక్షణలో పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వివిధ సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీతారానీల సరస్వతి అలంకరణలో దుర్గాదేవి తీర్చిదిద్దారు. అనంతరం 10 సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాసనిర్వహించారు. సంతాన లక్ష్మి వ్రతం, సువాసిని పూజ చేశారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ విసి ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో గాజుల మండ్యం సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. మృతుడు పసుపు రంగు, టీ షర్టు, నీలం రంగు అడ్డగిరల డ్రాయర్లు, నల్ల రంగు ఆఫ్‌షర్టు ధరించి ఉన్నాడు. అంతకు మించి మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతని వయసు సుమారు 50–55సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుని గుర్తుపట్టిన వారు ఎస్ఐ ఫోన్ నెం.9440900728, రూరల్ సీఐ ఫోన్ నెం.9440796764 తెలియజేయాలని పోలీసులు కోరుతున్నారు.

## క్షూరికాపురంలో సిమెంటు రోడ్డుకు మోక్షం

విజయపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:



మండలంలోని క్షూరికాపురంలో నగరి కనకమ్మసత్రం మెయిన్ రోడ్డు నుంచి బాలాజీ ఇంటి వరకు 100 మీటర్లు సిమెంటు రోడ్డు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సహకారంతో రోడ్డు నిర్మాణం చేపట్టామని, మరిన్ని వీధుల్లో కూడా సిమెంటు వేస్తామని సర్పంచ్ శేఖర్ తెలిపారు.

## శ్రీ ధనలక్ష్మి అలంకరణలో శ్రీ మానసాదేవి

పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయంలో శ్రీదేవి శరన్న వరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీ మానసాదేవి అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణలో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయంలోని శ్రీ వినాయక స్వామి, శ్రీ మానసాదేవి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, నాగాలమ్మకు ఉదయం విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో 9 మంది చిన్న పిల్లలకు కుమారి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మనక్షత్రం మూలా నక్షత్రం కావడంతో ఈ పూజను చేశారు. అనంతరం చిన్న పిల్లలకు ఒక పుస్తకం,పెన్నలు అందించారు.

## సేంద్రియ వ్యవసాయమే లక్ష్యంగా రైతు - ఏవో

పుత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

వ్యవసాయ యంత్రం పరికరాలు కోసం రైతులు వారి పేర్లను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని పుత్తూరు వ్యవసాయశాఖ ఏవో కోదండయ్య తెలిపారు. బుధవారం పుత్తూరు మండలంలో కైలాసపురం, నందిమంగళంలో వ్యవసాయశాఖ ఏవో మురళి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న రాయితీ పథకాలు వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల పథకాలు గురించి రైతులకు వివరించారు. అదే విధంగా డ్రిప్ సేద్యంకి సంబంధించి రాయితీలో డ్రిప్, స్ప్రింకర్లు రైతులకు అందుబాటులో ఉందని తెలియజేశారు. పూలసాగుకు సంబంధించి ఉద్యానశాఖ ద్వారా సంపంగి, ఛామంతి, బంతి, రోజా తోటలు వేసుకున్న రైతులకు ఎకరాకి 6400 రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నందిమంగళంలోని సంపంగి తోట సందర్శించి రైతులకు సంపంగి తోటలో మెళకువలు, రాయితీ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌వో వెంకటయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ సెల్వం, రైతులు పాల్గొన్నారు.

## అమ్మవారికి విశేష పూజలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంతో ఆకట్టుకుంటున్నారు. అమ్మవారి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో రోజుకో అలంకారాన్ని కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకార గురుకుల్ తీర్చి దిద్దుతున్నారు. ఈ నేపధ్యంలో ఆలయ ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు భక్తి శ్రద్దలతో అమ్మవారికి సారె అందించారు. అమ్మవారి ఆలయ ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారిని అలంకార మండపం నుంచి అంజంజి వినాయకుడు, బాల జ్ఞానాంబిక, మహానంది నుంచి బొమ్మల కొలువు వరకు భక్తులతో కలసి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఇఓ దంపతులతో పాటు ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్సె పెక్టర్ హరియాదవ్‌లు పాల్గొన్నారు.

## మోతకూలీలకు పంచ, కండువా విరాళం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న ఉత్సవాలకు భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ముఖ్యంగా ఆలయంలో నిత్య ఉత్సవాల సందర్భంగా మోత కూలీలకు నాయుడుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్స్ మరియు వేస్తా కసమర్లపూడి సుబ్రమని సురేష్ కుటుంబసభ్యులు సుమారు 50 మంది మోత చేస్తున్నారు. దేవుని మోసే భాగ్యం కల్గిన వారికి పంచ,కండువా విరాళంగా ఎఇఓ లోకేష్‌రెడ్డికి అందజేసారు.

## ప్రధానమంత్రితోనే హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయం

–బిజెపి రాష్ట్ర కార్యదర్శి

.శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దేశప్రధానమంత్రి మోదీజీతోనే హర్యానా రాష్ట్రంలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించిందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీపార్టీ కన్వీనర్ కోలా.ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హర్యానాలో బిజెపి వరుసగా మూడోసారి విజయం సాధించడం చారిత్రాత్మకం అన్నారు. హర్యానా రాష్ట్రంలో ఎగ్జిట్‌పోల్స్‌ను దిక్కరిస్తూ బిజెపి హ్యాట్రిక్ ఘన విజయం సాధించిందన్నారు. దేశ ప్రధాని రాష్ట్రాల అభివృద్ధి, సుపరిపాలన వల్ల సాధించిన విజయంగా ఈ విజయోత్సవాన్ని శ్రీకాళహస్తి బిజెపి పార్టీ కార్యాలయం ఎదురుగా కార్యకర్తలతో కలసి సంబరాలు చేసుకున్నామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం ముందు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకోవడంతో పాటు చిన్నారులు, నాయకులకు స్వీట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, అబ్బూరిపుల్లయ్యానాయడు, కనపర్తి ప్రసాద్, జివి.అమర్నాథ్, పిళ్ళారిబత్తినయ్య, కన్నావెంకటేశ్వర్లు, తిరుపాల్‌నాయుడు, సుబ్రమణ్యంరాజు, ధర్మయ్యయాదవ్, వేడాంకృష్ణయ్యలతో పాటు పలువురు బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సుజాత ప్రతిభ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యోగా మాస్టర్ సీనియర్ మహిళా విభాగంలో ఆయలం సుజాత ప్రధమస్థానం దక్కించుకుని బంగారు పతకం కైవసం చేసుకుంది. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పట్టణంలోని శ్రీశివసాయి యోగా సెంటర్ మాస్టర్ సుజాత ప్రధమస్థానం దక్కించుకోవడంతో పాటు త్వరలో జరగబోయే యోగా పోటీలకు ఎంపికయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా పట్టణంలోని పలువురు యోగా విద్యార్థులు సుజాతను అభినందించారు.

# తిరుపతి డివిజన్

## సరస్వతీ దేవిగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ

తిరుపతిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట చెంచువారికాలనీలోని శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలంకారం, కుంకుమార్చన, హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బిరుదాల క్రిష్ణారెడ్డి, బిరుదాల హనుమంత్‌రెడ్డి, సిద్దారెడ్డి, తులసీరామిరెడ్డి పెద్దఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి విరాళాలను బిరుదాల భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, పి..హనుమంత్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, పాలడుగు వేణు, అనిల్‌కుమార్‌రెడ్డి, తేజస్‌రెడ్డి తదితరులు అందించినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

## ఎంపిడిఓను కలిసిన సి.మల్లవరం టిడిపి నాయకులు

తిరుపతిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ఎంపిడిఓ కె.రామచంద్రను సి.మల్లవరం టిడిపి నాయ కులు మనోహర్ చౌదరి, ప్రభు, పాతకాల్వ శివారెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు. సి.మల్లవరం గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## శ్రీసరస్వతి దేవి అలంకరణలో శ్రీశక్తి చాముండేశ్వరి దేవి





తిరుపతిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:

తుమ్మలగుంట క్రాస్ ఎల్ఎస్ నగర్ కాలనీ వున్న శ్రీశక్తి చాముండేశ్వరి దేవి ఆలయంలో శరన్న నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడో రోజు బుధవారం అమ్మవారు శ్రీసరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకం, అలంకరణ, హోమంలు నిర్వహించి భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీ సివిల్ సప్లైయ్స్ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12గంటలకు ఆలయధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు వెంకట్రామిరెడ్డి, మాధవి, భవాని, బ్రహ్మానందరెడ్డి, లీలావతి, భాస్కర్, జీవరత్నం, శశికళ, మునిశేఖర్‌రెడ్డి, మల్లీశ్వరి, విష్ణు, ఇఆర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## రోశయ్య మరణం పార్టీకి తీరని లోటు

కేవీబీ పురం, అక్టోబరు 9 ప్రభాతవార్త:



పార్టీలో విశిష్ట సేవలందించి తెలుగుదేశం పార్టీ కోసం ఎమ్మెల్యే ఆదిమూలం గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పార్టీ కోసం ఆర్థికంగా ఎంతో ఖర్చు పెట్టి నడపించినటువంటి మాజీ సర్పంచ్, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి మాచర్ల రోశయ్య మృతి చెందడం పార్టీకి తీరని లోటని కేవీబీ పురం మండల టీడీపీ నాయకులు తెలిపారు. కేవీబీ పురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, రాయపేడు సర్పంచ్ పొన్నూరు బాలాజీ, మాజీ సర్పంచ్ కరపారెడ్డి, 7 మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

## ఘనంగా ముగిసిన ఆర్ఎస్ఎస్ శిక్షణ తరగతులు

రేణిగుంట, అక్టోబరు 9 ప్రభాతవార్త:

రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో వర సేవిక్‌సంఘ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతులు బుధవారం ఘనంగా ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంద మంది యువకులు శిక్షణలో పాల్గొని శిక్షణ తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ యువకులు ఆర్ఎస్ఎస్ వల్ల క్రమశిక్షణ నేర్చుకుంటారన్నారు. క్రమశిక్షణ అలవాడిన యువకులు దేశసేన చేయడానికి వెనుకాడరన్నారు.

## నేడు నగరిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ

నగరి, అక్టోబరు 9 ప్రభాతవార్త:



నేడు గురువారం నగరి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి 1 గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నగరి మున్సిపల్, రూరల్, నిండ్ర, విజయపురంకు చెందిన మున్సిపాలిటీ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## నగరి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన

జిల్లా ఆరోగ్య వైద్యశాఖ సమన్వయకర్త

నగరి, అక్టోబరు 9 ప్రభాతవార్త:



నగరి ఏరియా వైద్యశాలను బుధవారం చిత్తూరు జిల్లా ఆరోగ్య వైద్యశాఖ సమన్వయకర్త డా. ప్రభావతి తనిఖీలు నిర్వహించారు. వైద్య సిబ్బందితో చర్చించి వైద్యశాలలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే ఏఏ సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నేడు గురువారం జిల్లా కలెక్టర్ ఏరియా ఆస్పత్రికి పాల్గొనడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. మెడికల్ సుబ్రహ్మణ్యం, డా. జరీనా, ఆర్ఎంవో కార్తీకేయన్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దేశమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నగరి, అక్టోబరు 9 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్ కండ్రిగలో దేశమ్మ దేవాలయంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఆలయ ఈవో లత ఆహ్వానించారు. నూతనంగా నియమించబడిన లత ఎమ్మెల్యేను కలసి సన్మానించి ఆలయంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. పురోహితులు పురుషోత్తం, మదన్ మోహన్, వెంకటాచలం నాయుడు తదితరులు ఉన్నారు.

## సేంద్రియ వ్యవసాయమే లక్ష్యం : ఏడీ

సత్యవేడు, అక్టోబరు 9 ప్రభాతవార్త:




వ్యవసాయ యంత్రం పరికరాలు కోసం రైతులు వారి పేర్లను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం సత్యవేడు పట్టణంలోని దలవాయి, అగ్రహారం, సత్యవేడులలో వ్యవసాయశాఖ ఏవో మురళి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పీఎం కిసాన్ సొమ్ము పెండింగ్‌లోఉన్న రైతులు వ్యవసాయశాఖను సంప్రదించాలన్నారు. తద్వారా రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ సొమ్ము జమ అయ్యేలా అధికారులు క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్ పరికరాలు స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు కావలసిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తుందన్నారు. అవసరమైన రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తదనంతరం దలవాయి అగ్రహారంలో పలువురు రైతులకు సంబంధించి నారుమడులను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలోరైతులు పలువురు పాల్గొన్నారు.

# ధనుస్సు,బాణం ధరించి... వేంకటాద్రిరాముడుగా మలయప్ప



తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: దశావతారాల్లో శ్రీరామ అవతారం గుర్తు చేసుకుంటూ కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్ప చేతిలో ధనుస్సు, బాణం ధరించి వేంకటాద్రి రాముడుగా దర్శనమిచ్చాడు. శోభాయమానంగా జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు బుధవారం ఉదయం మలయప్పస్వామిని వేంకటాద్రిరాముడుగా అర్చకస్వాములు విశేషాభరణాలతో అలంకరణచేశారు. అంజనాద్రీశుడుకి హనుమంతుడు ప్రియభక్తుడు. చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా లంకాభీకరుడుగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రిరాముని మూపునవహించి తిరువీధులలో దర్శనమివ్వడం భక్తకోటికి ఆనందంకలిగించింది. ఆంజనేయుడు తనను సేవించే భక్తులకు ఆయురారోగ్యాలు,అష్టయిశ్వర్యాలు ప్రసాదిస్తున్నాడు. బుద్ధి,బలము,యశస్సు, ధైర్యము, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం,వక్తృత్వం హనుమంతుని స్మరిస్తే లభిస్తాయి. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూరహారతులిచ్చి మొక్కారు. భక్తులు ఆదపమొక్కులవాడా... గోవిందా... వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఓలు గౌతమి,వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఓ శ్రీధర్,తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ వివిఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ,భక్తులు పాల్గొన్నారు.

## ఏడుకొండలవాడా...ఏమని పొగడుదుమో...!

ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:

బ్రహ్మోత్సవాల వేళ రోజుకు రెండు వాహనాలపై వివిధ రకాల అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తున్న ఏడుకొండలస్వామి ఉత్సవమూర్తులు ఊరేగింపు సమయంలో సేవకులైన కళాకారులు తమకు తోచిన విధంగా నృత్యం చేస్తూ పరవశిస్తున్నారు. కలియుగంలో తనను శరణు జొచ్చిన భక్తులపాలిట ఆపద మొక్కులవాడుగా... అనాధరక్షకుడుగా కీర్తింపబడుతున్న స్వామిని ఆలయ నాలుగుమాఢవీధుల్లో భక్తితో సేవకులైన కళాకారులుతమకు తోచినరీతిలో ఆడిపాడుతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వందలాదిమంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. అప్సరసలే ఆనాడు దేవతలను నాట్యంతో ఆనందింపజేయగా నేడు కలియుగంలో భక్తితో కళాకారులు ప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు.








## బ్రహ్మోత్సవాల్లో నేడు



**10-10-2024 'సూర్యప్రభవాహనం' ఉదయం 8గంటలకు**

తిరుమలదేవుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు గురువారం ఉదయం శ్రీమలయప్పస్వామి సూర్యప్రభవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. సూర్యుడు తేజోనిధి.శ్రీమన్నారయణుడు సూర్యమండల మధ్యవర్తి. భారతీయులు సూర్యనమస్కారం చేయడం భక్తి అనుభూతి.

**'చంద్రప్రభవాహనం' రాత్రి 7గంటలకు**



బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజురాత్రి ఉత్సవమూర్తి మలయప్పస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. స్వామికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన శ్రీనివాసుడు రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించడం ఎంతైనా సమంజసం.

## మీ సేవలు అమూల్యం



**-టిటిడి ఈఓ,అదనపు ఈఓ అభినందనలు**

తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: బ్రహ్మోత్సవాలలో గరుడవాహనసేవను విజయవంతం చేయడంలో అన్ని రకాల సేవలందించిన ప్రతి ఒక్కరినీ టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అభినందించారు. అందరి సేవలు అమూల్యమని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది మరింతగా భక్తులకు రెట్టింపు సేవలందిద్దామన్నారు.

## శ్రీవారి సేవలో వైసిపి నేతలు



తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: బ్రహ్మోత్సవాల వేళ బుధవారం ఉదయం తిరుమలేశుని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, చిత్తూరు వైసిపి ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి, సత్యవేడు ఇన్‌ఛార్జి రాజేశ్ దర్శించుకున్నారు.



## కుప్పాన్ని...ఆదర్శ నియోజకవర్గంగా మలిచేందుకు ప్రణాళికలు

**- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ - సిఎం ఆదేశాలతో మంచి పరిశ్రమలు తెస్తాం..**

**సమస్యల పరిష్కారానికి ఇకపై పంచాయతీల్లో ' ప్రజాదర్బార్' !!**



కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని పేదరికం లేని ఆదర్శ నియోజకవర్గంగా మలిచేందుకు తగు ప్రణాళికలను విజన్ డాక్యుమెంట్ 2029 రూపొందించి నట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ )ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం ఆదేశాలతో కుప్పంలో ఉన్న 17 ప్రభుత్వ శాఖల్లో డివిజన్ స్థాయి అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికి మౌలిక వసతులు, ఆదాయ వనరులు ఉండాలనేది సిఎం ఆశయమన్నారు. ప్రజలకు అవసరమైన ఇల్లు, నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వంటగ్యాస్ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఇదివరకే తాగునీటి వసతి, మరుగుదొడ్ల కోసం సర్వే పూర్తి చేశామన్నారు. నియోజకవర్గానికి 15వేల మరుగుదొడ్లు మంజూరు కాగా పనులు సైతం జరుగుతున్నాయన్నారు. వీటి నిర్మాణాలు డిసెంబర్ కల్లా పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో 80వేల గృహాలకు గాను 20వేల గృహాలకు నేరుగా నీటి వసతి లేదని గుర్తించామని వారికి జెజెఎం ద్వారా నీటి కనెక్షన్లు అందిస్తామన్నారు. నవంబర్ 20వతేది లోగా హౌసింగ్ సర్వే పూర్తి చేస్తామన్నారు. నవంబర్‌లోనే పెన్షన్ సర్వే చేస్తామన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పానికి మంచి పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. హైదరాబాద్‌కు చెందిన అలిఫ్ సంస్థ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తగు శిక్షణ ఇవ్వడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు వారు సహకరిస్తారన్నారు. మహిళలకు పరిశ్రమల ఏర్పాటుకు 30ఎకరాలు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీస్, కేర్ ఆన్, ఇజిమార్ట్ సంస్థలతో ఎంఓయులు కుదుర్చుకున్నట్లు తెలిపారు. వీటిద్వారా ఇ–సైకిళ్లు, చిన్నపిల్లలకు మెదడుసమస్యలపై తగు వైద్య సేవలు, డ్వాక్రా సంఘాల మహిళలు ఏర్పాటుచేసే దుకాణాలకు ఉత్పత్తులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మరో ఐదారు నెలల్లో కుప్పంలో గ్రీవెన్స్‌కాల్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు. అక్టోబర్ 24నుంచి తాను ప్రతి బుధవారం గ్రామ పంచాయతీల్లో ప్రజాదర్బార్ కార్యక్రమంను నిర్వహిస్తానని ప్రకటించారు. అన్నిశాఖల అధికారులతో కలసి ప్రజల సమస్యలు తెలుసుకుని సాధ్యమైనంత మేర గ్రామాల్లో వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. కుప్పం అభివృద్ధిపై ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఏపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్‌మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబులతో చర్చిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ననియాల ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసి ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, బర్డ్ శాంక్చురీ తదితరాలు ఏర్పాటుచేస్తామన్నారు. జనవరిలో కుప్పంలోని పున్నమి టూరిజం హోటల్ ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు.

## నేటిలోపు ఫ్రీహోల్డ్ భూముల సమగ్ర నివేదికలు

**- జాయింట్ కలెక్టర్ విద్యాధరి**



చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికలను గురువారం నాటికి కలెక్టర్ కార్యాలయంకు అందించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆర్డీఓలు, తహసిల్దార్లను ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూముల నివేదికలకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మండలాల వారీగా ఆర్డీఓలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో జెసి మాట్లాడుతూ జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూములకు సంబంధించిన మండలాల వారీగా సమగ్ర వివరాలను గురువారంలోపు కలెక్టర్ కార్యాలయంకు అందించాలని ఆదేశించారు. సిసిఎల్ఏ ద్వారా ప్రతి మండలానికి అందిన వివరాల మేరకు మొత్తం విస్తీర్ణం, ట్రాన్స్‌శాక్షన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మా–4, 5లను పూర్తి చేసి ఎక్సెల్ షీట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కోర్టు కేసులు, డబుల్ ఎంట్రీలు, సిఓటి ఇలా ఎటువంటి రిమార్క్స్ వున్న అందులో చూపాలని ఆదేశించారు. అలాగే ప్రతి మండలంలో ఫ్రీ హోల్డ్‌లో వున్న భూములకు సంబంధించి సర్వే నెంబర్లు, అనుభవంలో వున్న వారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ బి.పుల్లయ్య, కుప్పం, నగరి, చిత్తూరు ఆర్డీఓలు శ్రీనివాసరాజు, వెంకటరెడ్డి,శ్రీనివాసులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

## లక్కెవరికో..!

**- మద్యం టెండర్లకు గడువు పెంపు**



కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో ఒక్క మద్యం దుకాణం దక్కినా చాలన్న భావనతో మద్యం టెండర్లకు దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. ఈ అవకాశాన్ని దక్కించుకోవడానికి రాజకీయ నాయకుల నుంచి దళారుల వరకు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ లాటరీ విధానం కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు దాఖలుకు 11వ తేదీ వరకు గడువు పెంచారు. వ్యాపార వాంఛ, రాజకీయ కాంక్షల మధ్యవర్తులు రాయబారాలు నడుపుతున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల దరఖాస్తులు వేయనివ్వకుండా కొందరు నేతలు జిల్లా స్థాయిలో అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల రాజకీయ నేతల బెదిరింపులతో దరఖాస్తులు తక్కువ సంఖ్యలో దాఖలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఉండటంతో కొందరు ధైర్యంగా, గోప్యంగా దరఖాస్తులు చేశారు. ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారనే విషయం తెలుసుకునే విధానం లేకపోవడంతో నేతలు, ఔత్సాహిక వ్యాపారులు ఆసక్తిగా ఇతరుల ద్వారా దరఖాస్తుదారుల గురించి ఆరా తీస్తున్నారు. ఐదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ వ్యాపారుల్లో ఆసక్తి పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి దక్కినా చాలు.. పరపతి పెంచుకోవచ్చనేది చాలామంది భావన. ఆ అవకాశాన్ని దక్కించుకోవడానికి రాజకీయ నేతల నుంచి దిగువస్థాయి దళారుల వరకు ప్రస్తుతం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగులు సైతం దుకాణాల కోసం పోటీలు పడుతున్నారు. కొందరయితే మద్యం దుకాణం ఉండటం స్టేటస్‌గా భావిస్తున్నారు. పరిమితి లేకపోవడంతో కొందరు పదుల సంఖ్యలో దరఖాస్తులు చేస్తున్నారు. ఏదయినా ఒకటి తగలకపోతుందా అనే భావనతో పోటీ పడుతున్నారు. ప్రభుత్వం దరఖాస్తులు దాఖలుకు మరో రెండురోజులు గడువు పెంచడంతో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బ్రహ్మపత్నే వాణీ...రంగనాయకే...!!

**-జన్మనక్షత్రం...చదువుల తల్లిగా గంగమ్మ**



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 9 ప్రభాతవార్త : సరస్వతీ మహాభద్రా మహామాయ వరప్రదా... అని కీర్తిస్తూ అమ్మవారి చెంత మొక్కులు తీర్చుకొన్నారు. శక్తిక్షేత్రం బోయకొండలో దసరా శరవన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అశ్వయుజశుద్ధ పంచమి, మూలానక్షత్రం రోజున అమ్మవారు సకల శుభాలు కల్గించే సరస్వతీదేవీగా కొలు తీరింది. మూలా నక్షత్రం గంగమ్మ జన్మనక్షత్రం. విద్యాదేవిగా మానవుల్లో జ్ఞానదీపాలు వెలిగించే త్రిశక్తుల్లో మహాశక్తిగా సరస్వతీదేవిని కొలుస్తారు. ఆదిప్రకృతి స్వరూపిణీ అయిన దుర్గాదేవి త్రిశక్తిస్వరూపిణీగా శుంభనీశుంభలనే రాక్షసుల్ని వధించింది. ఇందుకు చిహ్నంగా అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉభయదారులు చండీ, గణపతి హోమాలు నిర్వహించి పూర్ణాహుతిగావించారు. చౌడేపల్లి విజయవాణి విద్యాలయాలు, ప్రింటర్స్ యాజమాన్యం, కొలింపల్లి గగన్ యాదవ్, నందన్‌యాదవ్, స్కందన్‌యాదవ్, చార్విక, జాహ్నవిక, మిట్టూరు శంకరమ్మ, రెడ్డెప్ప, బి.కొత్తకోట శ్రీకాంత్, శ్రీదేవి, మదనపల్లి భాస్కర్, తిరుమల, చౌడేపల్లి శబరీష్‌గ్యాస్, పెట్రోల్‌పంపు విజలాపురం మోహన్‌బాబు, పద్మజ, బెంగళూరు శ్రీనివాసులు, వరలక్ష్మమ్మ, రాయచోటి రమేష్, మాధవీలతలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం వారికి అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించి గౌరవించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## గంగమ్మకు మాజీ మంత్రి చే పట్టు వస్త్రసాలు సమర్పణ



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 9 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దసరా మహోత్సవాల సందర్భంగా పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతీమణి స్వర్ణలత, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వారిని ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టు వస్త్రాల సమర్పణానతరం సరస్వతీదేవీగా కొలువుతీరిన గంగమ్మ దర్శనభాగ్యం కల్పించారు. యాగశాలలో పెద్దిరెడ్డి దంపతులకు వేదాశీర్వాదం పవిత్ర తీర్థ ప్రసాదాలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**అభివృద్ధిపై దృష్టి సారించాలి : పెద్దిరెడ్డి**

నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన తర్వాత ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. శక్తిస్వరూపిణీ బోయకొండలో గడచిన 5యేళ్ళల్లో దాదాపు రూ. 500కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదే జిల్లా వాసి కాబట్టి బోయకొండను మరింత అభివృద్ధి పరచాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి సంబంధించిన కొందరు నాయకులు అనేక తప్పులు చేశారన్నారు. మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ మాజీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, బోయకొండ మాజీ ఛైర్మన్లు మిద్దింటి శంకరనారాయణ, నాగరాజరెడ్డి, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎస్వీజీబి మాజీ సభ్యుడు పవన్‌రాయల్, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, లడ్డు రమణ, మాజీ ఎంపిపిలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, కళ్యాణభరత్, కరణంవారిపల్లి గిరి, తొండా శ్రీరాములు, పుంగనూరు, చౌడేపల్లి మండలాలకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాత్యాయనీ దేవి అలంకారంతో మరగదాంభిగా



కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీకాత్యాయనీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఉదయం అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి దూపధీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే అమ్మవారి ఉత్సవమూర్తిని సాయంత్రం మండపంలో వుంచి శ్రీకాత్యాయనీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొకు ్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం సామూహిక కుంకుమార్చన, రాత్రి ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా గ్రామోత ్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై గాయత్రి అలంకరణలో ఎల్లమ్మ

**వైభవంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు**



చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు గాయత్రి దేవి అలంకరణలో అశ్వ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా ఆలయ పడికావలికి తీసుకువచ్చి వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారికి విశేష అలంకరణ గావించి అశ్వ వాహనంపై అధిష్టింపజేశారు. రాత్రి 8 గంటలకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు బాజాల నడుమ అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. ఈ వాహన సేవకు చంద్రగిరి పాతపేటకు చెందిన దివంగత ఎల్.సరోజమ్మ, ఎల్.వెంకటక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం కుమారులు ఎల్.విజయభాస్కర్‌రెడ్డి అండ్ బ్రదర్స్, రిటైర్డ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.మునిరెడ్డి, ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ విరూపాక్షి మమత శంకర్ రెడ్డి, పాకాల కృపాలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, కుమారులు చేతన్ కుమార్ రెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి, చరణ్‌కుమార్ రెడ్డి, సంతపల్లి జయపాల్ రెడ్డి దాతలుగా వ్యవహరించారు. వీరికి ఆలయ ఈఓ కె.మమత దర్శన ఏర్పాట్లు గావించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారు అశ్వవాహనాధిరూఢియై భక్తులకు దర్శనమివ్వడం ద్వారా కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాల నుండి భక్తులను విముక్తులను గావిస్తారని భక్తుల విశ్వాసం.

## పాహిమాం..చదువుల తల్లి సరస్వతీదేవీ

**-ఆకట్టుకున్న అలంకరణలు**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అమ్మవారితో పాటు పట్టణంలో వెలసిన అమ్మవారు రక్తభీజాక్షరి అలంకరణలోదర్శనం ఇవ్వవగా, ఆలయాల్లో అలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమ్మవారి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మలకొలువులో వెలసిన అమ్మవారు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వగా, ఆలయంలో వెలసిన కనకదుర్గాదేవి అమ్మవారు మహాసర స్వతీదేవిగా, ఏడుగంగమ్మల అమ్మవారు విశేష అలంకరణలో దర్శనం ఇవ్వగా,కృష్ణారెడ్డి మండపంలో ఏర్పాటుచేసిన అమ్మవారు సరస్వతీదేవిగా, బంగారమ్మ అమ్మవారు సరస్వతీదేవిగాను, భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరిదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలోను, వేదాం దక్షిణకాళికా మాత అమ్మవారు చదువుల తల్లిగా సాక్షాత్కరించగా, పాగనల్‌లో వెలసిన పొన్నాలమ్మ అమ్మవారు సరస్వతీదేవిగా, బజారువీధిలో వెలసిన వాసవీకన్యకా పరమేశ్వరిదేవి సరస్వతీదేవి అలంకరణలోను దర్శనం ఇచ్చారు.

## జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలి

**జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్**



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త : జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఈ నెల 3 నుండి 5 వరకు కృష్ణ జిల్లా నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి కుస్తి పోటీలలో విజేతలైన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలలో రాణించాలని, కుస్తీ పోటీలలో విజేతల బాలబాలికలకు వారు సాధించిన మెడల్స్‌ను, మేమంటోలను అందజేసి వారి అభినందించి బాల బాలికలతో గ్రూప్ పోటో దిగారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ ఈ నెల 3 నుండి 5 వరకు కృష్ణ జిల్లా నిర్వహించిన 68 రాష్ట్ర స్థాయి కుస్తి పోటీలలో జిల్లా నుండి అండర్ 14 సంవత్సరం, అండర్ 17 సంవత్సరాలు, అండర్ 19 విభాగాలలో బాల, బాలికలు పాల్గొని, 24 బంగారు, 19 వెండి, 19 కాంచ పథకాలు సాధించారని, రాష్ట్ర స్థాయిలో అండర్ 17, అండర్ 19 బాలురు, అండర్ 14, అండర్ 19, బాలికలు ఓవర్ ఆల్ ఛాంపిన్‌గా నిలిచారు. వీరిలో 24 మంది బాల బాలికల ఎన్‌జిఎఫ్ జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 23 నుండి 27 వరకు మెరిట్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించే ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, కుస్తీ కోచ్, ఉదయ్, డిఎస్ఏ కోచ్‌లు సుమతి, వినోద్, మహజీజ్, ప్రేమనాథ్, కుస్తీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన ఎస్ఈ శ్యాంసుందర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్యను నూతన సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా నియమితులైన శ్యాంసుందర్ బుధవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న మోహన్ బదిలీపై నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈగా వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఈ శ్యాం సుందర్ బదిలీపై వెళుతున్న ఎస్ఈ మోహన్‌ను మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిఈలు మహేష్, రాజు, లలిత, వెంకట ప్రసాద్, రమణ, మధుకుమార్, పలువురు ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఘనంగా సన్మానించారు.

## దోష నివారణ పూజలకు డ్రెస్‌కోడ్ తప్పని సరి : ఇఓ



శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో తిరుపతి ఆర్‌జెసి,శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ అమలు చేస్తున్న సంస్కరణలు కొన్ని ప్రజల భక్తుల ప్రసంశలందుకుంటుండగా మరి కొన్ని సంస్కరణలు భక్తులకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో రాహుకేతుదోష నివారణ పూజలకు హాజరయ్యే భక్తులు తప్పని సరిగా పంచె,కండువా,మహిళలు చుడీ దారు, చీర ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. దాంతో బుధవారం కొందరు భక్తులు పూజలు నిర్వహించే వారిపై తిరుగుబాటు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా రూ.2500,రూ.5వేల పూజలు నిర్వహించు చోట కొందరు భక్తులు ప్యాంట్లు ధరించి రాగా అక్కడ పూజలు నిర్వహించే అర్చకులు అభ్యంతరం చెప్పారు.ముందు సమాచారం లేకుండా అమలు చేయటంపై వ్యతిరేకత వ్యక్తమౌతుంది. హఠాత్తుగా నిబంధనలు అమలు చేస్తే ఎలా అని ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేని అర్చకులు ఇది దేవస్థానం నిర్ణయం అంటున్నారు. అయితే కొన్ని సంస్కరణలు అమలుచేసే సమయంలో మొదట కొద్దిగా ఇబ్బందిగా ఉంటుందని, భక్తులు అలవాటు పడతారని అధికారులు భావిస్తున్నారు.

## జాతీయ పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త : ఆధ్యాత్మిక చింతనలోనే కాకుండా ఆటల్లో కూడా రాణిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థులు ఎంపిక అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ పోటీలకు ఇటీవల విశాఖ జిల్లా వనపర్తిలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలకు శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని పసుపులేటి ఉమ హాజరయ్యారు.ఈ నెల 5 నుంచి నిర్వహించిన అంతర్‌జిల్లాల జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బికాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.ఉమ పాల్గొన్నారు. తమ విశేష ప్రతిభను చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో స్థానం సాధించింది. బుధవారం కళాశాల ఆవరణలో ఉమకు సత్కారం ఏర్పాటు చేసారు. ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. ఆమె కృషితో నేడు శ్రీవిద్యాప్రకాశానంద ప్రభుత్వ జూనియర్ కళాశాల(మహిళ) పేరు ప్రతిష్టలు జాతీయ స్థాయిలో నిలుపుకున్నారన్నారు.ఈసన్మాన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్‌తో పాటు పిడి నరసింహాఆరవు, కోచ్ స్వప్న,జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘ సభ్యులు సత్కరించారు.